ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 37.8 | కనిష్ఠం : 26.0

ఆటోలోంచి జారిపడి చిన్నారి మృతి

జడ్చర్ల, జూన్ 3: ఆటోలోంచి జారిపడి బాలిక మృతి చెందిన సంఘటన సోమవారం జడ్చర్ల పట్టణంలో చోటు చేసుకుంది. జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జడ్చర్ల మండలం గొల్లపల్లికి చెందిన శివకుమార్, లక్ష్మీ దంపతులకు ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం మరికల్ గ్రామానికి వెళ్లిన లక్ష్మీ.. కుమార్తె సాన్విక(4), రెండు నెలల వయస్సున్న బాబుతో సోమవారం మరికల్ నుంచి గొల్లపల్లికి ఆటోలో బయల్దేరింది. జడ్చర్ల పట్టణంలోని బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ సమీపంలో సాన్విక ఆటోలోంచి కింది పడింది. తీవ్రంగా గాయపడిన బాలికను ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందిందని వైద్యులు తెలిపారు. తల్లి లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తులో ఉంది.



ఉత్కంఠ

- నేడు మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానాల ఎన్నికల ఫలితాలు
- రెండు చోట్ల హోరాహోరీగా సాగిన పోరు
- త్రిముఖ పోరులో ఎవరు నెగ్గుతారనేదానిపై సర్వత్రా ఆసక్తి
- కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేసిన అధికార యంత్రాంగం
- పాలమూరు, కందనూలులలో ఓట్ల లెక్కింపు కేంద్రాలు

మహబూబ్‌నగర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి పాలమూరులోని రెండు లోక్‌సభ నియోజకవర్గాల్లో ఎవరు గెలుపొందుతారన్న విషయమై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ రెండు స్థానాల్లో త్రిముఖ పోరు నెలకొంది. హోరాహోరీగా సాగిన ఈ ఎన్నికల పోలింగ్ మే 13న జరగ్గా.. మంగళవారం ఓట్ల లెక్కింపును చేపట్టనున్నారు. ఇందుకోసం నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్‌లలో కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం ఎనిమిది గంటలకు మొదట పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించనున్న అధికారులు.. 8:30 గంటల నుంచి ఈవీఎంల ఓట్లను లెక్కించనున్నారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ నుంచి ఎన్నికల్లో 31 మంది అభ్యర్థులు బరిలో నిలవగా, నాగర్‌కర్నూల్ నుంచి 19 మంది అభ్యర్థులు పోటీ చేశారు. అయినప్పటికీ.. మూడు ప్రధాన పార్టీల మధ్యే పోరు తీవ్రంగా జరిగిందని చెప్పొచ్చు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి, జోష్‌లో ఉన్న కాంగ్రెస్.. పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటడం ద్వారా గెలుపును పరిపూర్ణం చేసుకోవాలని భావిస్తోంది. మరోవైపు కేంద్రంలో మరోసారి మోదీ సర్కారు ఏర్పాటు కావడంలో తమ వంతు పాత్ర పోషించాలని బీజేపీ ఆశిస్తోంది. పదేళ్ల రాష్ట్రంలో అధికారంలో ఉండటంతోపాటు పార్లమెంట్ సీట్లను కూడా ఎక్కువగా కైవసం చేసుకుంటూ వచ్చిన బీఆర్‌ఎస్.. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో చతికిలపడింది. దాంతో ఈ పార్లమెంట్ ఎన్నికల్లో గెలవడం ద్వారా పార్టీకి పునరుజ్జీవం పోసుకోవాలని ఆ పార్టీ నాయకులు పని చేశారు. ఈ నేపథ్యంలో రెండు నియోజకవర్గాల్లో ముక్కోణపు పోరు జరిగింది. ఎగ్జిట్ పోల్స్ ఇప్పటికే విడుదల కాగా.. నాగర్‌కర్నూల్‌లో కాంగ్రెస్ గెలుస్తుందని.. మహబూబ్‌నగర్‌లో బీజేపీ, కాంగ్రెస్ మధ్య తీవ్ర పోటీ ఉంటుందని మెజారిటీ సంస్థలు ప్రకటించాయి. అయితే ఓటరు నాడి పట్టుకోవడం అసాధ్యమైన నేపథ్యంలో ఎవరు గెలుస్తారనే విషయంలో మాత్రం ఉత్కంఠ నెలకొంది. అభ్యర్థులు ఎక్కువ కావడంతో పోలింగ్‌లో డబుల్ బ్యాలెట్ ఈవీఎంలను వినియోగించారు.

ఓటేసిన 12.18 లక్షల మంది..

మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో 16,82,470 మందికి ఈ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించగా.. 12,18,587 మంది ఓటు వేశారు. మొత్తం 72.43 శాతం పోలింగ్ నమోదైంది. కొడంగల్ నియోజకవర్గంలో 2,41,794 మంది ఓటర్లు ఉండగా.. 1,71,776 మంది ఓటు వేయడంతో 71.04 శాతం పోలింగ్ నమోదైంది. నారాయణపేట నియోజకవర్గంలో 2,36,182 మంది ఓటర్లు ఉండగా.. 1,63,284 మంది ఓటు వేయడంతో 69.13 శాతం, మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో 2,59,260 మంది ఓటర్లు ఉండగా.. 1,71,815 మంది ఓటు వేయడంతో 66.27 శాతం, జడ్చర్ల నియోజకవర్గంలో 2,22,838 మంది ఓటర్లు ఉండగా.. 1,73,634 మంది ఓటు వేయడంతో 77.92 శాతం, దేవరకద్ర నియోజకర్గంలో 2,39,745 మంది ఓటర్లు ఉండగా.. 1,78,602 మంది ఓటు వేయడంతో 74.50 శాతం, మక్తల్ నియోజకవర్గంలో 2,44,173 మంది ఓటర్లు ఉండగా.. 1,74,898 మంది ఓటు వేయడంతో 71.63 శాతం, షాద్‌నగర్ నియోజకవర్గంలో 2,38,478 మంది ఓటర్లు ఉండగా.. 1,84,578 మంది ఓటు వేయడంతో 77.40 శాతం పోలింగ్ నమోదైంది.



పీయూలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు

కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి..

రెండు లోక్‌సభ నియోజకవర్గాలకు సంబంధించి.. ఉదయం ఎనిమిది గంటలకే ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. మొదట పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కిస్తారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్‌కు సబంధించి పాలమూరు యూనివర్సిటీలో, నాగర్‌కర్నూల్‌కు సంబంధించి వ్యవసాయ మార్కెట్ యార్డులో ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు చేశారు. మహబూబ్‌నగర్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లు ఉండగా.. అన్ని సెగ్మెంట్లకు సంబంధించి 8.30 గంటల నుంచి ఈవీఎంల కౌంటింగ్ ప్రారంభమవుతుంది. ఒక్కో నియోజకవర్గానికి 14 టేబుళ్లు ఏర్పాటు చేశారు. కొడంగల్‌కు 21 రౌండ్లలో లెక్కింపు పూర్తి చేశారు. నారాయణపేటకు 20 రౌండ్లు, మహబూబ్‌నగర్‌కు 20, జడ్చర్లకు 20, దేవరకద్రకు 21, మక్తల్‌కు 21, షాద్‌నగర్‌కు 19 రౌండ్లలో ఓట్లను లెక్కిస్తారు. ప్రతీ టేబుల్‌కు ఒక ఏఆర్‌వో, ఒక సూపర్‌వైజర్, ఒక అసిస్టెంట్, ఒక మైక్రో అబ్జర్వర్ అందుబాటులో ఉంటారు. పోస్టల్ బ్యాలెట్‌కు ఒక ఏఆర్‌వో, ఒక సూపర్‌వైజర్, ఇద్దరు అసిస్టెంట్లు, ఒక మైక్రో అబ్జర్వర్‌ను ఏర్పాటు చేశారు. మొత్తం సూపర్‌వైజర్లు 140 మంది, కౌటింగ్ అసిస్టెంట్లు 150 మంది, మైకో అబ్జర్వర్లు 145 మందిని కేటాయించారు. ఉదయం ఆరు గంటలకు వీరికి టేబుళ్లు కేటాయించనున్నారు. ఎప్పటికప్పుడు ఫలితాలను ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌తో పాటు ఎన్‌కోర్ యాప్‌లో నమోదు చేయనున్నారు. అన్ని నియోజకవర్గాల ఫలితాలను కలిపి.. రౌండ్ల వారీగా వెల్లడిస్తారు. పోరు హోరాహోరీగా సాగినందున ఫలితాలు తొందరగానే తేలే అవకాశం లేదు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లు ఉండగా 30 టేబుళ్లను ఏర్పాటు చేశారు.


కౌంటింగ్ కేంద్రం


నాగర్‌కర్నూల్‌లో కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

నేడు తేలనున్న భవితవ్యం

- నాగర్‌కర్నూల్‌లో 30 టేబుళ్ల ఏర్పాటు
- కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

నాగర్‌కర్నూల్,(ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి ఏర్పాట్లు చేసింది. బరిలో నిలిచిన అభ్యర్థుల భవితవ్యం నేడు తేలనుంది. కౌంటింగ్ కోసం 30 టేబుళ్లను ఏర్పాటు చేయనున్నారు. నాగర్‌కర్నూల్, గద్వాల, అచ్చంపేట, వనపర్తి అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి 16 టేబుళ్లు, అలంపూర్, కొల్లాపూర్, కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గాలకు సబంధించి 14 టేబుళ్లను ఏర్పాటు చేయనున్నారు. కౌంటింగ్‌ను రికార్డు చేసేందుకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.

19 మంది పోటీ

నాగర్‌కర్నూల్ ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గం నుంచి ప్రధాన రాజకీయ పక్షాలతో సహా మొత్తం 19 మంది బరిలో నిలిచారు. వారి భవితవ్యం మంగళవారం తేలనుంది. పార్లమెంట్ పరిధిలో కల్వకుర్తి, అచ్చంపేట, కొల్లాపూర్, వనపర్తి, గద్వాల, అలంపూర్, నాగర్‌కర్నూల్ అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. 17,38,254 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో 8,73,343 మంది స్త్రీలు, 8,64,877 మంది పురుష ఓటర్లున్నారు. 12,7,471 ఓట్లు పోలయ్యాయి.

ఏర్పాట్ల పరిశీలన

కౌంటింగ్ కేంద్రం ఏర్పాటు చేసిన నెల్లికొండ వ్యవసాయ మార్కెట్ యార్డును కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ సోమవారం మధ్యాహ్నం పరిశీలించారు. ఏర్పాట్లపై అధికార యంత్రాంగంతో చర్చించి, భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. కౌంటింగ్ ఎనిమిది గంటలకు ప్రారంభం కావాలని అధికారులను ఆదేశించారు. పోస్టల్ బ్యాలెట్లలో అనుమానాలుంటే పార్టీల ఏజెంట్లకు వివరించాలన్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్‌ను విధించినట్లు తెలిపారు. కౌంటింగ్‌కు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.


అమరచింత శ్రీకృష్ణ నగర్‌లో ఇంటిలోకి చేరిన వర్షపు నీరు


ఆత్మకూరు ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు


వంగూరులో పిడుగుపాటుకు మృతి చెందిన ఆవు


నవాబ్‌పేట మండలం యన్మనగండ్లలో కనిపించిన ఆరుద్ర పురుగులు

కుండపోత

- జోగుళాంబ గద్వాల, మహబూబ్‌నగర్ జిల్లాల్లో భారీ వర్షం
- అలంపూర్‌లో ఇళ్లలోకి చేరిన నీరు
- ఉండవల్లిలో పొంగిన వాగులు.. నిలిచిన రాకపోకలు
- సీసీకుంట మండలంలో పొంగిపొర్లిన ఏదులాపూర్ చెక్‌డ్యాం
- వంగూరులో పిడుగు పాటుకు ఆవు మృతి
- భారీ వర్షంతో పంటలు సాగు చేస్తున్న రైతులు


సీసీకుంట మండలం ఏదులాపూర్ వద్ద ఊకచెట్టువాగులో అలుగు పారుతున్న చెక్‌డ్యాం

మహబూబ్‌నగర్/నవాబ్‌పేట/చిన్నచింతకుంట/అలంపూరు/ఉండవల్లి/మల్దకల్/రాజోలి/మానవపాడు/అలంపూర్ చౌరస్తా/వడ్డేపల్లి/అయిజ/వనపర్తి అర్బన్/అమరచింత/ఆత్మకూరు/వంగూరు/అమ్రాబాద్/నారాయణపేట/ఊట్కూర్/కృష్ణ, జూన్ 3: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు వర్షం కురిసింది. జోగుళాంబ గద్వాల, వనపర్తి జిల్లాల్లో భారీ వర్షం పడింది. జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్‌లో ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. పలు వాగులు పొంగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. పలు చోట్ల చెరువులు, కుంటల్లోకి నీరు చేరింది. నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరులో పిడుగు పాటుకు ఆవు మృతి చెందింది. భారీ వర్షంతో రైతులు పంటల సాగుకు సన్నద్ధమౌతున్నారు. అలంపూర్ నియోజకవర్గంలో భారీ వర్షం కురిసింది. పట్టణంలోని అక్బర్‌పేట కాలనీలలో మోకాలు లోతు నీళ్లు చేరాయి. వర్షానికి వ్యవసాయ పొలాల్లో నీరు చేరింది. ఆర్డీఎస్ కాల్వతో పాటు చిన్న చిన్న కాల్వల్లో నీరు పారడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఇళ్లలోకి చేరడంతో పాములు, తేళ్లు వస్తున్నాయని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. లింగనవాయి గ్రామంలో ఇళ్ల ముందు, రోడ్లపైన నీరు చేరింది. క్యాతూరు, భీమవరం, బుక్కాపురంలో డ్రైనేజీలు, వాగులు పొంగిపొర్లాయి. మల్దకల్ మండల కేంద్రంతో పాటు ఎల్కూరు, కుర్తిరావుల చెర్వు, నాగర్‌దొడ్డి, పాల్వాయి, విఠలాపురం, మద్దెలబండ గ్రామాల్లో సోమవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. ఎగువ నుంచి వచ్చిన వరదతో ఎల్కూరు నక్కల వాగు ఉప్పొంగింది. మండలంలో 55 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. కేటీదొడ్డి మండల కేంద్రంతో పాటు మండలంలోని ఉమిత్యాల, కొండాపురం, వెంకటాపురం, ఈర్లబండ, నందిన్నె గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. దాంతో పలు గ్రామాల్లోని చెరువులు, కుంటల్లో నీళ్లు నిలవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వర్షానికి రాజోలి మండలంలోని నీరు నిలిచింది. మండల కేంద్రంలోని రైతు వేదిక భవనం ముందు నీరు నిలిచి, చెరువును తలపిస్తోంది. మండలంలో 147.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. మానవపాడు మండలంలో వర్షం కురిసింది. మండల కేంద్రంలో 60.4 మిల్లీ మీటర్ల వర్షపాతం న మోదైనట్లు తహసీల్దార్ వాహిదా ఖాతున్ తెలిపారు. బ్రిడ్జి నిర్మాణంలో ఉన్నందున వర్షానికి నీరు నిలిచి, పెద్దపోతులపాడు, చిన్నపోతులపాడు గ్రామాల ప్రజలు చెన్నిపాడు మీదుగా మానవపాడుకు వచ్చేందుకు రాకపోకలు ఆగిపోయాయి. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో నీరు నిలిచింది. మానవపాడు మండలంలోని అమరవాయి, ఉండవల్లి మండలం బొంకూర్, మెన్నిపాడు వాగులు పొంగి ప్రవహించాయి. వర్షానికి అయిజలో రహదారులు, కాలనీలు సలమయం అయ్యాయి. పలు వాగులు, చెరువుల్లోకి నీరు చేరింది. మండలంలో 47 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

ఉండవెల్లి అతలాకుతలం

ఉండవల్లి మండల కేంద్రంతో పాటు మండలంలోని కంచుపాడు, తక్కశిల, ప్రాగటూర్, మారమునగాల, బైరాపురం, బస్వాపురం, చిన్న ఆముదాలపాడు తదితర గ్రామాలలో సోమవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. రెండు గంటలకుపైగా ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. దాంతో మండల కేంద్రంలో 110.3 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. మండల కేంద్రంలోని అనసూయమ్మ కాలనీ వాగు పొంగి పొర్లింది. దాంతో పలు కాలనీల్లో ఇళ్ల ముందు మోకాలు లోతు నీళ్లు నిలిచాయి. బైరాపురం బీసీ కాలనీ చెరువును తలపించింది. ఉండవల్లి జడ్పీహెచ్ఎస్ మైదానం పూర్తిగా నీట మునిగింది. ఈదురు గాలులకు విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడగా, సిబ్బంది మరమ్మతులు చేశారు. ఉండవల్లి నీలమ్మ వాగు, అనసూయమ్మ కాలనీ వాగు రోడ్డుపై పారడంతో అలంపూర్, జోగుళాంబ స్టేషన్, చిన్న ఆముదాలపాడు తదితర గ్రామాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడ్డారు. బైరాపురం, బస్వాపురం మధ్యన వాగు ఉధృతంగా ప్రవహించడంతో రెండు గ్రామాలకు కొన్ని గంటల పాటు రాకపోకలు నిలిచిపోయాయి. మారమునగాల వద్ద గల బ్రిడ్జి వద్ద వర్షపు నీరు భారీగా చేరి, రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మునిసిపాలిటీ కేంద్రమైన వడ్డేపల్లి, శాంతినగర్‌తో పాటు మండలంలోని పలు గ్రామాల్లో కురిసిన వర్షానికి రోడ్లపై నీరు నిలిచింది. డ్రైనేజీలు పొంగిపొర్లాయి. మునిసిపల్ అధికారులు సోమవారం శాంతినగర్ పట్టణంలోని కాలువల్లో, ప్రధాన రోడ్డు పక్కన నిలిచి ఉన్న వర్షపు నీటిని జేసీబీ సహాయంతో తొలగింపజేశారు.

విరిగిన చెట్లు

వనపర్తి జిల్లాలోని పలు మండలాల్లో వర్షం కురిసింది. అమరచింత పట్టణంలోని శ్రీకృష్ణనగర్, ఎస్సీ కాలనీ, బీసీ కాలనీ, శివాజీనగర్‌లు నీటితో నిండిపోయాయి. శ్రీకృష్ణనగర్, ఎస్సీ కాలనీల్లోని పలువురి ఇళ్ల ముందు నీరు నిలిచాయి. వర్షపు నీటితో పాటు డ్రైనేజీ నీరు రావడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలు చోట్ల చెట్లు విరిగిపడ్డాయి. మునిసిపల్ చైర్‌పర్సన్ మంగమ్మనాగభూషణం గౌడ్, మునిసిపల్ కమిషనర్ నూరుల్ నజీబ్ ఆదేశాల మేరకు మునిసిపల్ సిబ్బంది కాలనీల్లో సహాయక చర్యలు చేపట్టారు. వర్షానికి ఆత్మకూరు పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్ నుంచి కొత్తకోటకు వెళ్లే ప్రధాన రహదారుల గుండా వర్షపు నీరు నిలిచి, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మదనాపూర్ మండలంలో అత్యధికంగా 67.3 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

పాలమూరులో పొంగిన చెక్‌డ్యామ్‌లు

పాలమూరు జిల్లా వ్యాప్తంగా మోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది. సీసీకుంటలో అత్యధికంగా 75.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. చెక్‌డ్యామ్‌లు నిండి అలుగులు పారుతున్నాయి. చిన్నచింతకుంట మండలంలో పర్ధీపూర్, నెల్లికొండి గ్రామాలతో పాటు ఎగువన కురిసిన వర్షానికి నక్కల వంపు పారింది. ఏదులాపూర్ గ్రామ శివారులోని ఊకచెట్టువాగులోని చెక్‌డ్యాం అలుగు పారింది. ఏదులాపూర్ గ్రామ శివారులోని హైదరాబాద్, ఆత్మకూర్ రహదారిపై భారీగా వర్షపు నీరు నిలవడంతోవాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

కనిపించిన ఆరుద్ర పురుగులు

వర్షానికి నవాబ్‌పేట మండలం యన్మనగండ్లలో ఆరుద్ర పురుగులు కనిపించాయి. దాంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులు జొన్నలు, కందులు నాటారు.

పిడుగు పాటుకు ఆవు మృతి


నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండల కేంద్రంలో సోమవారం తెల్లవారుజామున పిడుగు పడి ఆవు మృతి చెందింది. రైతు శ్రీను తన పొలంలో ఆవును కట్టేశాడు. ఆ సమయంలో పిడుగు పడటంతో ఆవు అక్కడికక్కడే చనిపోయినట్లు రైతు చెప్పాడు. దాని విలువ రూ.70 వేలు ఉంటుందని, ప్రభుత్వం పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరాడు. అమ్రాబాద్ ఉమ్మడి మండలంలో భారీ వర్షం కురిసింది. దాంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. మండలంలోని జంగంరెడ్డిపల్లి, అమ్రాబాద్, తెలుగుపల్లి తదితర గ్రామాల్లోని చెరువుల్లోకి నీరు చేరింది.

విత్తనాలు వేసిన రైతులు

నారాయణపేట జిల్లా వ్యాప్తంగా మోస్తరు వర్షం కురిసింది. అధికంగా మరికల్ మండలంలో 89 మిల్లీ మీటర్లు, అత్యల్పంగా కోస్గి మండలంలో 17.6 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. ఈదురు గాలులతో పలు చోట్ల చెట్లు విరిగిపడ్డాయి. దాంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఊట్కూర్ మండలంలో బిజ్వార్, అవుసులోన్‌పల్లిలో చెట్లు విరిగి పడ్డాయి. చిన్నపొర్లలో పాఠశాల ఆవరణలోకి నీళ్లు చేరాయి. ఇప్పటికే కొందరు రైతులు విత్తనాలు వేయగా.. ఈ వానకు మిగతా వారు విత్తనాలు వేసేందుకు సిద్ధమవుతున్నారు. ధన్వాడ వర్షపాత కేంద్రాన్ని జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి జీవరత్నం పరిశీలించారు. కృష్ణ మండలం అయినాపూర్ వెళ్లే రోడ్డు రైల్వే బ్రిడ్జి కింద వర్షం నీరు నిలవడంతో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది.

విరిగి పడిన కొండచరియలు

- శ్రీశైలం ఘాట్ రోడ్డులో రాకపోకలకు అంతరాయం


శ్రీశైలం డ్యాం సమీపంలో రోడ్డుపై పడ్డ బండరాళ్లు

దోమలపెంట, జూన్ 3 : నాగర్‌కర్నూల్ జిల్లాలోని శ్రీశైలం డ్యామ్ సమీపంలో కొండచరియలు విరిగి పడ్డాయి. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. నల్లమల అటవీ ప్రాంతంలోని వటువర్లపల్లి, దోమలపెంట, ఈగలపెంట పాతాళగంగ గ్రామాల్లో సోమవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. దీంతో ఈగలపెంట దిగువన, శ్రీశైలం డ్యాం సమీపంలో ఘాట్ రోడ్డుపై కొండ చరియలు విరిగి పడ్డాయి. వాహనాల రాకపోకలు లేని సమయంలో కొండ చర్యలు విరిగిపడటం వల్ల పెద్ద ప్రమాదం తప్పింది. రహదారిపై కూలిపడిన మట్టి, చిన్న చిన్న కొండ రాళ్లను స్థానికులు తొలిగించారు. పెద్ద రాళ్లు తొలగించే అవకాశం లేక వాటిని అలాగే వదిలేశారు. దీంతో వాహనాలు ఎదురెదురుగా వస్తే ముందుకు వెళ్లలేని పరిస్థితి నెలకొన్నది. సంబంధిత అధికారులు స్పందించి పెద్ద రాళ్లను తొలగించాలని, కొండ చరియలు విరిగి పడకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు, పర్యాటకులు కోరుతున్నారు.

వలలో చిక్కుకొని మత్స్యకారుడు మృతి

- వెన్నచెర్ల గ్రామంలో ఘటన

పెద్దకొత్తపల్లి, జూన్ 3: చెరువులో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తున వలలో చిక్కుకుని మత్స్యకారుడు మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం వెన్నచెర్ల గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెన్నచెర్ల గ్రామానికి చెందిన మత్స్యకారుడు చింతకుంట సుధాకర్(59) ఆదివారం సాయంత్రం గ్రామ శివారులోని పెద్దచెరువులో చేపలు పట్టడానికి వెళ్లాడు. చెరువులో వల వేస్తుండగా ప్రమాదవశాత్తు వలలో చిక్కుకుని, నీటిలో మునిగి మృతి చెందాడు. ఈ సంఘటనపై మృతుడి కుమారుడు రాజు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు చెరువు ద్దకు చేరుకుని, శవ పరీక్ష నిర్వహించారు. పోస్టుమార్టం నిమిత్తం శవాన్ని నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య నర్సమ్మ, ఒక కుమారుడు, ఐదుగురు కూతుర్లు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు.

సారా విక్రేతల బైండోవర్

వెల్దండ, జూన్ 3 : నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలంలోని వివిధ తండాలకు చెందిన సారా విక్రేతలను ఎక్సైజ్ అధికారులు సోమవారం తహసీల్దార్ రవికుమార్ ఎదుట ముందస్తుగా బైండోవర్ చేశారు. మండలంలోని రావిచెట్టుబావితండా, గాజులోనిబావితండా, పోచమ్మగడ్డ తండాలకు చెందిన ఐదుగురు సారా విక్రేతలను ఎక్సైజ్ సీఐ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు తహసీల్దార్ రవికుమార్ ఎదుట ముందస్తుగా బైండోవర్ చేశారు. సారా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా తహసీల్దార్ హెచ్చరించారు.

పెబ్బేరులో పెరిగిపోతున్న నేర చరిత్ర

పెబ్బేరు, జూన్ 3 : పెబ్బేరు పరిసర ప్రాంతాల్లో రోజురోజుకు నేరాలు పెరిగిపోతున్నాయి. ఒకప్పుడు రాయలసీమలో ఉండే నేర చరిత్ర ఇప్పుడు ప్రశాంతంగా ఉండే తెలంగాణ పల్లెలకు పాకింది. ముఖ్యంగా రాయలసీమకు సమీపంలో ఉండే నడిగడ్డ ప్రాంతంలో కొంత మేర నేర చరిత్ర ఉండేది. అది కాస్త నది దాటి పెబ్బే రు తదితర ప్రాంతానికి పాకింది. మారణాయుధాలతో దాడులు చేసుకొని చంపు కునే పరిస్థితికి వచ్చింది. గత ఏప్రిల్ 21వ తేదీన కర్నూల్ ప్రాంతానికి చెందిన కిరాయి రౌడీలు పట్టపగలు పెబ్బేరు పట్టణంలో ఒక వ్యక్తిపై మారణాయుధాలతో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. అదృష్టవశావత్తు ఆ వ్యక్తి బతికి బయట పడ్డాడు. ఆ కేసు మరవక ముందే గత ఆదివారం పెబ్బేరు పట్టణంలోని కిష్టారెడ్డి పేట మాంటిసోరి పాఠశాల కరస్పాండెంట్ రాజేందర్‌గౌడ్‌పై గుర్తు తెలియని వ్య క్తులు కత్తులతో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఆయన ప్రస్తుతం ఆసు పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో రాయలసీమ నేర చరిత్ర పచ్చని పల్లెల్లోకి చొరబడిందని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. వీటికి తోడు పెరిగిన దొంగతనాలు, దారి దోపిడీలు, మాదక ద్రవ్యాల వాడకం పెరిగిపోవడంతో ప్రజల్లో తీవ్రమైన ఆందోళన వ్యక్తమవుతోంది. వీటిని అదుపు చేయడంలో పోలీసులు పూ ర్తిగా విఫలయమ్యారని ప్రజలు విమర్శిస్తున్నారు.



సంఘటన స్థలంలో జాగిలాలతో తనిఖీ చేస్తున్న పోలీసులు

లారీ బోల్తా... డ్రైవర్‌కు గాయాలు

కొత్తకోట, జూన్ 3 : మండలంలోని మిరాసిపల్లి గ్రామ జాతీయ రహదారి బస్‌షెల్టర్ వద్ద లారీ అదుపు తప్పి బోల్తా పడి డ్రైవర్‌కు గాయాలైన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. హైదరాబాద్ వైపు బండలతో వెళ్తున్న లారీ అదుపు తప్పి రోడ్డు పక్కనే బోల్తా పడింది. లారీలో ఉన్న డ్రైవర్ సంతోష్‌కు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం 108లో జిల్లా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై మంజునాథ్‌రెడ్డి తెలిపారు.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి వ్యక్తికి..

ఆత్మకూరు, జూన్ 3 : ద్విచక్ర వాహనం అదుపు తప్పి వ్యక్తికి గాయాలైన సంఘటన సోమవారం ఆత్మకూరు మండలంలోని బాలకృష్ణాపూర్ గ్రామ శివారులో చోటు చేసుకుంది. ప్రయాణికులు, కుటుంబ సభ్యుల సమాచారం మేరకు.. కొత్తకోట మండలం కానాయపల్లి గ్రామానికి చెందిన యాదయ్య ఆత్మకూరులో పని కోసం వచ్చాడు. పని ముగించుకుని సాయంత్రం వెళ్తుండగా బాలకృష్ణాపూర్ వద్ద అదుపు తప్పి ద్విచక్ర వాహనం పైనుంచి పడిపోయాడు. గమనించిన ప్రయాణికులు అతన్ని ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం యాదయ్య చికిత్స పొందుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఖరీఫ్ సీజన్ వస్తున్నా...

రైతు అవగాహన సదస్సులేవీ...?

వెల్దండ, జూన్ 3 : ఒకవైపు ఖరీఫ్ సీజన్ రాబోతుంది. ఇప్పటికే రైతులు తమ వ్యవసాయ పొలాలను అడపా దడపా పడుతున్న వర్షాలతో దుక్కులు సిద్ధం చేసుకుంటున్నారు. సాంప్రదాయ వ్యవసాయానికి రైతులను సిద్ధం చేసే క్రమంలో అధికారులు ఇప్పటికే అధునిక వ్యవసాయ పద్ధతుల పట్ల అవగాహన కల్పించాల్సి ఉంది. కానీ గ్రామాల్లో అవేమీ కనబడడం లేదు. మరికొద్ది రోజుల్లో నైరుతి రుతుపవనాలు రాబోతున్నట్లు అధికారులు ప్రకటించినా, రైతుల్లో చైతన్యం కలిగించే పద్ధతులు వివరించేందుకు మాత్రం అధికారులు కనబడడం లేదు. గతంలో రైతు అవగాహన సదస్సులు, రైతు చైతన్యయాత్రలు నిర్వహించి రైతులకు అవగాహన కల్పించేవారు. కాగా గత మూడేళ్లుగా రైతులను పట్టించుకోవడంలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో మే నెలలో రైతు సదస్సుల పేరిట వ్యవసాయం, మార్కెటింగ్, బ్యాంకర్లు, పశుసంవర్ధకశాఖ, ఉద్యానవనశాఖ, సెరికల్చర్, ఫిషరీస్, విద్యుత్ శాఖలకు చెందిన అధికారులు ప్రతీరోజు గ్రామాల్లో పర్యటించేవారు. ఈ క్రమంలో ఆధునిక వ్యవసాయ పద్ధతులు, పంట రుణాలు, పండ్లతోటల పెంపకం, వాటికి సంబంధించిన సబ్సిడీలు, పశువుల పెంపకం వంటి వాటిపట్ల అవగాహన కల్పించేవారు. రైతులు ఏ పొలాల్లో ఏపంటలు వేయాలో భూసార పరీక్షలు నిర్వహించే విధానాన్ని వివరించేవారు. నాణ్యమైన విత్తనాలు, పంటల అధిక దిగుబడులకు రసాయన ఎరువులకు బదులుగా సేంద్రియ ఎరువుల వాడకాన్ని రైతులకు చేరవేసేవారు. అదేవిధంగా రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను మార్కెట్‌లో దళారులకు విక్రయించి మోసపోవద్దని, ప్రభుత్వం ద్వారా ఏర్పాటుచేసే కొనుగోలు కేంద్రాలలోనే గిట్టుబాటు ధరలకు విక్రయించాలని సూచనలు ఇచ్చేవారు. కాగా, గత కొన్నేళ్లుగా వ్యవసాయ పద్ధతులపట్ల అవగాహన కల్పించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారుల చొరవచూపి అవగాహన సదస్సులు నిర్వహించాలని మండల రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటయ్యేనా?

- ఇరుకైన గదుల్లోనే ప్రభుత్వ కార్యాలయాలు
- అధికారులు కూర్చోవడానికి కూడా జాగా లేదు


పశువైద్యశాలలో ఉన్న తహసీల్దార్ కార్యాలయం

ఊర్కొండ, జూన్ 3: చిన్న మండలాల ఏర్పాటుతో ప్రజలు సంతోషపడ్డారు. ఇరుకైన గదుల్లో ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయడంతో అధికారులకు, వివిధ పనుల నిమిత్తం వస్తున్న ప్రజలకు ఇబ్బందిగా మారింది. అధికారులు కూర్చొవడానికి సైతం స్థలం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన తీరుతో ఇబ్బందులకు గురవుతున్న ప్రజానీకానికి, ప్రభుత్వ అధికారులకు ప్రస్తుత ప్రభుత్వమైనా సౌకర్యాలతో కూడిన కార్యాలయాల ఏర్పాటు సమకూర్చేనా అంటూ పేర్కొంటున్నారు.

పశువుల దవాఖానాలో తహసీల్ కార్యాలయం

తహసీల్దార్ కార్యాలయం పశువైద్యశాలలో కొనసాగుతున్నది. సరిపడ గదులు లేక అక్కడే ఉన్న వాటర్ ట్యాంకు కింది భాగంలో గిర్దావరులు కూర్చొవడానికి సీట్లు కేటాయించారు. ఇద్దరు గిర్దావరులు పనులు చేయడానికి వసతులు లేక ఒకరు కూర్చుంటే మరొకరు బయటికి ఫీల్డ్‌లోకి వెళ్లాల్సి వస్తుంది. వచ్చిన ఫైళ్ల పెట్టడానికి స్థల కొరతతో కాళ్ల వద్దే పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. అదేవిధంగా పనుల నిమిత్తం వచ్చిన ప్రజలకు నిలబడి మాట్లాడే పరిస్థితి లేదు. అదేవిధంగా తహసీల్దార్ వద్దకు భూమి రిజిస్ట్రేషన్‌ల నిమిత్తం వచ్చే వారికి సైతం కూర్చొవడానికి సీట్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.


చిన్నపాటి అద్దె ఇంట్లో కొనసాగుతున్న పోలీస్‌స్టేషన్

జీపీ భవనంలో మండల ప్రజాపరిషత్ కార్యాలయం

గ్రామ పంచాయతీ భవనంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయం కొనసాగుతున్నది. ఈ ఒక్క భవనంలోనే మూడు కార్యాలయాలు కొనసాగుతున్నాయి అంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం అవుతుంది. గ్రామ పంచాయతీ కార్యాలయం, ఎంపీడీవో, ఉపాధి హామీ పథకం కార్యాలయాలు కొనసాగుతున్నాయి. అందరు అధికారులు ఒకేచోట ఉండటానికి సరియైన గదులు లేక చెట్లనీడ నుంచి పరిపాలన కొనసాగిస్తున్నారు. ఎస్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవోకు ఇప్పటి వరకు కుర్చీలేదంటే అతిశయోక్తి కాదేమో మరి.

అద్దె భవనంలో పోలీస్‌స్టేషన్

ఇరుకైన అద్దె భవనంలో పోలీస్‌స్టేషన్ కొనసాగుతున్నది. పోలీస్‌స్టేషన్ వద్దకు వివిధ ఫిర్యాదులు ఇవ్వడానికి వచ్చిన బాధితులకు నిలబడి మాట్లాడే పరిస్థితి లేదు. వచ్చిన వారికి సరియైన వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అదేవిధంగా పీహెచ్‌సీ, ఇందిరాక్రాంతి పథకం కార్యాలయాలు కూలడానికి సిద్ధంగా ఉన్న ప్రభుత్వ పాత పాఠశాల భవనంలో కొనసాగుతున్నాయి. రైతువేదికలో వ్యవసాయాధికారి కార్యాలయం కొనసాగుతున్నది. వీటికి సొంత భవనాలు ఏర్పాటు చేస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. గత ప్రభుత్వం ఎలాగూ పట్టించుకోలేదు. ఈ ప్రభుత్వమైనా తగిన చర్యలు తీసుకుంటే ఇటు అధికారులకు, అటు ప్రజలకు ఇబ్బందులు తొలగే ఆవకాశం లేకపోలేదు. స్థానిక ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్‌రెడ్డి ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు ఏర్పాటు చేసేలా కృషి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కనీస వసతులు లేక ఇబ్బందులు



వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలకు వెళితే కనీస వసుతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అధికారులతో కూర్చొని కాకుండా కనీసం నిలబడి మాట్లాడటానికి కూడా వసతులు లేవు. చిన్న మండలాలు ఏర్పాటు అయిన తర్వాత పరిపాలన దగ్గరికి వచ్చిందని సంతోషపడ్డాం. వసతుల లేమితో బాధపడుతున్నాం. ప్రస్తుత ప్రభుత్వం కార్యాలయాలకు భవనాల నిర్మాణం చేపడుతుందని ఆశిస్తున్నాం.

- మొండెల్ల కృష్ణ, ఊర్కొండపేట

పనులు వేగంగా చేపట్టాలి


పనులను పరిశీలిస్తున్న పీడీ నర్సిములు

హన్వాడ, జూన్ 3 : పాఠశాలలు పునఃప్రారంభం నాటికి పనులను వేగంగా పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి, డీఆర్‌డీవో పీడీ నర్సిములు అధికారులను ఆదేశించారు. సోమవారం నల్లోనిపల్లి, ఏనిమీదితండా, కొత్తపేట, టంకర పాఠశాలల్లో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు.

తాగునీటి సౌకర్యం, కరెంట్, ఇతర మౌలిక సదుపాయాల పనులు పూర్తి చేయాలని కమిటీ సభ్యులను, అధికారులను కోరారు. ఆయన వెంట ఎంపీడీవో యశోదమ్మ, ఎంఈవో రాజు నాయక్, ఏపీఎం సుదర్శన్ పాల్గొన్నారు.

ముగిసిన హ్యాండ్‌బాల్ శిక్షణ శిబిరం


హ్యాండ్‌బాల్‌లో శిక్షణ పొందిన క్రీడాకారులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూన్ 3 : జిల్లా క్రీడాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి హ్యాండ్‌బాల్ శిబిరం ముగిసింది. సోమవారం ముగింపు కార్యక్రమానికి హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రజనీకాంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎంతో మంది క్రీడాకారులు హ్యాండ్‌బాల్‌లో రాణిస్తున్నారని, రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎంపిక య్యారన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో ఎంతో మంది క్రీడాకారుల ప్రతిభ వెలుగులోకి వచ్చిందన్నారు. అనంతరం క్రీడాకారులకు టీషర్టులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ జియావుద్దీన్, వైస్ ప్రసిడెంట్ బాలరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ అహ్మద్‌హుస్సేన్, కోచ్‌లు ప్రదీప్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువుల తయారీపై శిక్షణ

మదనాపురం, జూన్ 3: సేంద్రియ ఎరువుల తయారీపై శిక్షణ ఇవ్వనున్నట్లు కేవీకే శాస్త్రవేత్త రాజేందర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి చదివిన నిరుద్యోగ యువకులు ఈనెల 9వ తేదీలోపు మండల కేంద్రంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో తమ పేరు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

శిక్షణలో భోజన వసతి ఉంటుదని, జీవరసాయన ఎరువులు, పచ్చి రొట్టె తయారీ వర్మి కంపోస్టు, సస్య రక్షణ చర్యలు వంటివి నేర్పబడునని కావున ఆసక్తి ఉన్న రైతులు శిక్షణకు రావాలని ఆయన పేర్కొన్నారు.

నిరాడంబరుడు వేణుగోపాల్‌రెడ్డి

- విద్యాభివృద్ధిలో ఆయన సేవలు చిరస్మరణీయం
- జాతీయ విద్యా సంఘం ఉపాధ్యక్షుడు ఎంఏ.హఫీజ్‌ఖాన్


మాట్లాడుతున్న జాతీయ విద్యా సంఘం ఉపాధ్యక్షుడు ఎంఏ.హఫీజ్‌ఖాన్

కందనూలు, జూన్ 3 : నిరాడంబర నిస్వార్థ వ్యక్తిగా ఆర్.వేణుగోపాల్‌రెడ్డి సేవలు చిరస్మరణీయమని నాగర్‌కర్నూల్ జాతీయ విద్యా సంఘం ఉపాధ్యక్షుడు ఎంఏ.హఫీజ్‌ఖాన్ అన్నారు. జాతీయ విద్యా సంఘం అధ్యక్షుడు, నేషనల్ హై స్కూల్ మాజీ ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల్‌రెడ్డి సంస్మరణ సభను స్థానిక తిరుమల కన్వెన్షన్‌లో సోమవారం నేషనల్ హై స్కూల్ యాజమాన్యం, సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ముందుగా వారి చిత్ర పటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించి, పలువురు వక్తలు మాట్లాడారు. మాజీ మంత్రి పి.మహేంద్రనాథ్ సహకారంతో పాఠశాల అభివృద్ధికి అహర్నిషలు పాటుపడిన వ్యక్తి వేణుగోపాల్ రెడ్డి అన్నారు. 1954 నుంచి 2014వరకు సుమారు ఐదు దశాబ్దాలుగా పాఠశాలలో ప్రిన్సిపాల్‌గా , కరస్పాండెంట్‌గా జాతీయ విద్యా సంఘ అధ్యక్షులుగా విశిష్ట సేవలు అందించిన మహోన్నత వ్యక్తి అన్నారు. పాఠశాల పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ వారితో తమకు గల అనుబంధాన్ని జ్ఞాపకం చేసుకున్నారు. ఈ సమావేశంలో సభ నిర్వాహకులు, పాఠశాల కరస్పాండెంట్ అబ్దుల్లాఖాన్ వ్యవహరించగా, సంఘ సభ్యులు జీవీ.సుబ్బారావు, పి.మునీంద్రనాథ్, డాక్టర్ నూర్జహాన్, వంకేశ్వరం లక్ష్మయ్య, పోల శ్రీధర్, సాయిబాబుతో పాటు పాఠశాల విశ్రాంత ప్రధానోపాధ్యాయులు సాంబయ్య, సుందరాచారి, విజయమ్మ, పాఠశాల పూర్వ విద్యార్థులు వార్డెన్ చెన్నయ్య బాలస్వామి, తీగల బాలస్వామి, ఆత్మానందం, కవి దేవదానం, శాంతమ్మ, మాజీ జడ్పీటీసీ మణెమ్మ, ఐద్వా నాయకురాలు గీత, వి.నిరంజన్, శరత్‌బాబు, ఆర్.శ్రీనివాసులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.రవి, ఉపాధ్యాయులు వహీద్‌ఖాన్, ఆర్.సత్యం, జి.మురళీధర్, విశ్వేశ్వరయ్య, బి.అరుణ, చంద్రశేఖర్, విశ్రాంత ఉద్యోగులు రామచంద్రారెడ్డి, భగవంత్‌రెడ్డి, బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డి, వేణుగోపాల్, భూత్పూర్ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

బీడీ కార్మికుల చర్చలు సఫలం

- వేయి బీడీలకు రూ.235లకు ఒప్పందం
- సానుకూలంగా స్పందించిన బీడీ ఫ్యాక్టరీల యజమానులు


బీడీ కంపెనీల యజమానులతో చర్చలు చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

పాలమూరు/ చిన్నచింతకుంట/ అమరచింత, జూన్ 3 : బీడీ కార్మికులకు కూలి రేటు పెంచాలని పలుదఫాలు యజమా నులతో కార్మిక సంఘాల నాయకులు చేసిన చర్చలు సో మవారం సఫలమయ్యాయి. వేయి బీడీలకు రూ.230లు, పీఎఫ్ వాటా రూ.5లు మొత్తం రూ.235లు ఇచ్చేందుకు యాజమాన్యం ఒప్పందం చేసుకుందని ఐఎఫ్‌టీయూ, సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, టీఎఫ్‌టీయూ సంఘాల నాయకులు తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలో యజమానులతో కార్మిక నాయకులు చేసిన చర్చల్లో గ్రాట్యుటీపై మరోసారి చర్చిద్దామని యజమానులు కోరారని తెలిపారు. ఇప్పటి వరకు యజమానులతో కార్మిక సంఘాల నాయకులకు ఐదుసార్లు చర్చలు జరిగాయి. ఐదో దఫా జరిగిన చర్చల్లో వేయి బీడీలకు రూ.207 నుంచి రూ.235కు యజమానులు ఒప్పుకున్నారని తెలిపారు. పెరిగిన కూలిరేట్లు ఏప్రిల్-2024 నుంచి అమల్లోకి వస్తా యని తెలిపారు. రెండేళ్ల నుంచి అనేకమంది కార్మికులు పనిచేస్తూ మరణించారని, చేతకాక బీడీ చేసే పనిని వదులుకున్నారని యజమానులకు వివరిం చినట్లు నాయకులు తెలిపారు. అలాంటి వారికి నేటికీ గ్రాట్యుటీ చెల్లించకపోవటం విషాదకరమన్నారు.

ఇకముందు అలా చేస్తే కార్మిక సంఘాలు సహించవని స్పష్టం చేసినట్లు పేర్కొన్నారు. బీడీ ఫ్యాక్టరీల యజమానులు సోహెల్, సల్గుటి సుధాకర్‌రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, వసీమ్, జియాసే ట్‌లతో ఐఎఫ్‌టీయూ నాయకులు కె.సూర్యం, జేఎస్ దేవ దానం, కోళ్ల వెంకటన్న, పి.అరుణ్ కు మార్, ఏ.కొండన్న, సీఐటీయూ నాయకులు ఎం.డి. మహిమూద్, వేణుగోపాల్, బుచ్చన్న, ఏఐటీయూసీ నాయకులు వెంకటేష్, రామ్మోహన్, రాబర్ట్, ఐఎన్‌టీయూసీ నాయకులు దాసు, కె.పెద్దబాలరాజు, సవారన్న, టీఎఫ్‌టీయూ నాయకులు ఎస్.ఎం ఖలీల్, యాదగిరి, టీఆర్‌ఎస్‌కేవీ నాయకులు ఎస్.అ బహం, ఎస్.జాన్, పెద్దబాలరాజు, సాంబశివుడు, గణేష్, పెంటన్న, నాయకులు పాల్గొన్నారు.

గ్రంథాలయాన్ని తెరిపించాలి


వెన్నచెర్లలో మూతబడిన నూతన గ్రంథాలయం

పెద్దకొత్తపల్లి, జూన్ 3: మండల పరిధిలోని వెన్నచెర్ల గ్రామంలో రూర్బన్ మిషన్ పథకం కింద నిర్మించిన గ్రంథాలయ భవనాన్ని తెరిపిం చాలని ఆ గ్రామ అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు వంగూరు అశోక్ ప్రభుత్వాన్ని కోరారు. రూ ర్బన్ మిషన్ నిధులతో నిర్మించి నూతన గ్రంథాలయ భవనాన్ని ఈ ఏడాది జనవరిలో మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభోత్సవం చేశారు. ప్రారంభించి ఐదు నెలలు గడుస్తున్నా నేటికి గ్రంథాలయంలో దినపత్రికలు, పుస్తకాలు ఏర్పాటు చేసి లైబ్రేరియన్‌ను నియమించడకపోవడంతో ఆదరణకు నోచుకోవడం లేదన్నారు. సంబంధిత శాఖ అధికారులు తక్షణమే స్పందించి మూతపడిన గ్రంథాలయాన్ని వెంటనే తెరిపించాలని ఆయన కోరారు.

ఖేలో ఇండియా శిక్షణా కేంద్రాలు క్రీడాకారులకు వరం

-ఉమ్మడి జిల్లాలో 3 ఫుట్‌బాల్ శిక్షణ కేంద్రాలు
-120పైగా క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ

మహబూబ్‌నగర్‌స్పోర్ట్స్, జూన్ 3: చిన్నారుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికితీసి అంతర్జాతీయ స్థాయి ఎదిగేందుకు కేంద్ర సర్కార్ 'ఖేలో ఇండియా' శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తోంది. తెలంగాణ రాష్ట్రంలోనే ఉమ్మడి జిల్లాలో వనపర్తి జిల్లాలో పెబ్బేర్‌లో గతేడాది శిక్షణ కేంద్రం మంజూరు కాగా, ఈ ఏడాది మహబూబ్‌నగర్, గద్వాల జిల్లాలకు కేంద్రాలు మంజూరైంది. మహబూబ్‌నగర్, గద్వాల స్టేడియం మైదానంలో ఈ ఏడాది ఫిబ్రవరిలో ఖేలో ఇండియా ఫుట్‌బాల్ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేశారు. అండర్-14, 17, 19 విభాగంలో ఉమ్మడి జిల్లాలోని మూడు కేంద్రాల్లో దాదాపు 120పైగా మంది క్రీడాకారులు ఉదయం, సాయంత్రం ఫుట్‌బాల్ కోచ్‌ల పర్యవేక్షణలో శిక్షణ పొందుతున్నారు. శిక్షకులకు కేంద్ర సర్కార్ ద్వారా నెల రూ.25 వేల వేతనం ఇస్తారు. క్రీడాకారులు ప్రత్యేక శిక్షణ అందజేసి ప్రతిభ గల క్రీడాకారులను వెలికితీస్తారు. రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదిగేలా తర్ఫీదు ఇస్తారు. ఫుట్‌బాల్ అసోసియేషన్, ఎస్‌జీఎఫ్ తదితర టోర్నీల్లో పాల్గొనేలా క్రీడాకారులను తయారు చేస్తారు. జాతీయస్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేసి, జాతీయస్థాయి ఎక్స్‌లెన్సీ కేంద్రాలకు ఎంపిక చేస్తారు. అక్కడ క్రీడాకారులకు అత్యున్నత ప్రయాణాలతో శిక్షణ, భోజన, వసతి, క్రీడాదుస్తులు, విద్య అందిస్తారు. అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా క్రీడాకారులను తీర్చిదిద్దుతారు.


గద్వాల స్టేడియంలో ఫుట్‌బాల్‌లో సాధన చేస్తున్న దృశ్యం

● ప్రతిభను వెలికితీసి..

ఖేలో ఇండియా ఫుట్‌బాల్ శిక్షణ కేంద్రాలు ఫుట్‌బాల్ క్రీడా కారులకు వరంలాంటింది. పిల్లలను క్రీడల వైపు దృష్టిసారించేలా చేయటం, క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీసి అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దుతారు. కేంద్రాల ఏర్పాటుతో ఎంతో మంది గ్రామీణ, పట్టణాలను నుంచి ఎంతో మంది ప్రతిభ గల క్రీడాకారులు వెలుగులోకి వస్తారు. క్రీడా మైదానాలు నిర్మించి క్రీడాల్లో భారతదేశాన్ని అగ్రగామిగా తీర్చిదిద్దటమే లక్ష్యంగా 'ఖేలో ఇండియా'ను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోంది. ఖేలో ఇండియాలో భాగంగా ప్రస్తుతం బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, ఫుట్‌బాల్, వాలీబాల్, హకీ, టేబుల్‌టెన్నిస్, హాకీ, అథ్లెటిక్స్ కబడ్డీ, అర్చరీతో పాటు 26 క్రీడాంశాలు ఉన్నాయి. క్రీడాభివృద్ధిపై కేంద్రం ప్రభుత్వం మరింత దృష్టిసారించి, నిధులతో పాటు శిక్షకులు, అన్ని వసతులు, క్రీడా మైదానాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.


మహబూబ్‌నగర్ స్టేడియంలో ఫుట్‌బాల్ సాధన చేస్తున్న చిన్నారులు

ఫుట్‌బాల్ క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలి



ఖేలో ఇండియా ఫుట్‌బాల్ శిక్షణ కేంద్రాన్ని ఫుట్‌బాల్ క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలి. బాల,బాలికలకు 42 మంది ఉదయం, సాయంత్రం కోచ్ నికేశ్ పర్యవేక్షణలో శిక్షణ పొందుతున్నారు. కోచ్‌లను నియమించి వసతులు కల్పిస్తే మరి కొందరు యువ క్రీడాకారులను తయారు చేయవచ్చు. ఇప్పటికే ఇండోర్‌స్టేడియంలో వివిధ క్రీడా అంశాల్లో ఉన్న కోచ్‌లతో శిక్షణ అందజేస్తున్నాం.

- ఎస్.శ్రీనివాస్, డీవైఎస్‌వో

రాజశేఖర్ మృతి బాధాకరం

- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి



రాజశేఖర్ మృతదేహం వద్ద సంతాపం తెలుపుతున్న జిల్లెల చిన్నారెడ్డి

వనపర్తి టౌన్, జూన్ 3: కాంగ్రెస్ పార్టీకి విధేయుడిగా ఉండే చాకలి రాజశేఖర్ అకాల మరణం చాలా బాధాకరమని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. పట్టణంలోని 19వ వార్డుకు చెందిన రాజశేఖర్ ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న చిన్నారెడ్డి సోమవారం ఆయన నివాసానికి వెళ్లి మృతదేహానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులకు మనోధైర్యం చెప్పారు. అదేవిధంగా పట్టణంలో వివిధ కారణాలతో సోమవారం మృతి చెందిన బాధిత కుటుంబాలను కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చీర్ల చందర్, లక్కాకుల సతీష్ పరామర్శించి సంతాపం తెలిపారు. బాధిత కుటుంబాలను పరామర్శించిన వారిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చీర్ల జనార్ధన్, రాగి వేణు, అబ్దుల్లా, కౌన్సిలర్ బాపనిపల్లి వెంకటేష్, చీర్ల సత్యం సాగర్, విభూది నారాయణ, డీ వెంకటేష్, రాములు యాదవ్, కందికోట శ్రీను తదితరులు ఉన్నారు.

సంఘటన స్థలాన్ని పరిశీలించిన చిన్నారెడ్డి

పెబ్బేరు, జూన్ 3: పెబ్బేరు పట్టణంలోని మాంటిసోరి స్కూల్ ప్రిన్సిపాల్ రాజేందర్‌గౌడ్‌పై గుర్తు తెలియని దుండగులు హత్యాయత్నానికి పాల్పడిన విషయం తెలుసుకున్న చిన్నారెడ్డి సోమవారం సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ప్రశాంత వాతావరణంలో ఉన్న పట్టణం ఇటువంటి అఘాయిత్యాలు జరగడం మంచిది కాదని, నిందితులను వెంటనే గుర్తించాలని పోలీసులను కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యకుడు ఎద్దుల విజయవర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కారుపాకుల వెంకట్‌రాములు యాదవ్, కృపాకర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, ఎండీ ఆరిఫ్, మజీద్ తదితరులు ఉన్నారు.

రాజకీయాల్లోకి విష సంస్కృతి తెచ్చిందే కాంగ్రెస్ పార్టీ

- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నిరంజన్‌రెడ్డి

వనపర్తి అర్బన్, జూన్ 3: రాజకీయాల్లోకి విష సంస్కృతి తీసుకువచ్చిందే కాంగ్రెస్ పార్టీ అని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి మండిపడ్డారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాల్లో భాగంగా చివరి రోజు జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అసెంబ్లీ ఎన్నికల్లో 1.8 శాతం ఓట్లతో ఓడిపోయినంత మాత్రాన రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీని బొందపెడతానని మూర్ఖపు అహంకారాన్ని వెల్లడిస్తున్నారని మండిపడ్డారు. ఒక మంత్రి పార్లమెంట్ ఎన్నికల తరువాత ఆ పార్టీ ఉండదని, తన ఆక్రోసాన్ని వెళ్లగక్కుతున్నాడని విమర్శించారు. 24 ఏళ్ల బీఆర్ఎస్ పార్టీ చరిత్రలో ఉద్యమ నాయకుడు కేసీఆర్ ఎన్నో ఒడిదుడుకులు చూశారని గెలిచినప్పుడు పొంగిపోలేదని, ఓడినప్పుడు ఎగిరి గంతులు వేయలేదని అన్నారు. మొన్న జరిగిన స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి సంఖ్యాబలం లేకున్నా నైతిక విలువలకు విరుద్ధంగా ఆ పార్టీ అభ్యర్థితో కోట్లు ఖర్చు పెట్టించి బరిలోకి దింపి భ్రష్టు పట్టించారని విమర్శించారు. రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజమని, ప్రజల నిర్ణయమే శిరోధార్యం అన్నారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ... చిన్నంబావి మండలం లక్ష్మీపల్లి గ్రామంలో శ్రీధర్ రెడ్డి హత్యకు గురై 11 రోజులు అవుతున్నా ముఖ్యమంత్రి, పోలీస్ అధికారులు నిందితులను పట్టుకోవడంలో ఎందుకు విఫలమయ్యారని ప్రశ్నించారు. హత్యకు గురైన శ్రీధర్ రెడ్డి తండ్రి శేఖర్ రెడ్డి నిందితుల పేర్లు చెప్పిన కూడా వారిని ఎందుకు అరెస్టు చేయలేదని నిలదీశారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, బీఆర్ఎస్ మీడియా సెల్ కన్వీనర్ అశోక్, తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో బోరు మోటారు ఏర్పాటు



బోరు మోటారును ప్రారంభిస్తున్న గ్రామస్థులు

గోపాల్‌పేట, జూన్ 3: మండల కేంద్రంలోని శ్మశాన వాటికలో నీటి అవసరాల కోసం స్థానికులు కర్రోళ్ల భాస్కర్ బోరు మోటారు, వీధి దీపాలు ఏర్పాటు చేయించారు. ఎన్నో ఏళ్లగా నాయకుల చుట్టూ తిరిగినా విద్యుత్ లైన్, బోరు మోటార్ సౌకర్యం కల్పించలేదని గ్రామస్థులు దాతను సన్మనించారు. ఈ కార్యక్రమంలో బాలస్వామి, గోపాల్, శివన్న, శేఖర్, శివ, కురుమయ్య, బాలు, కొండయ్య, వెంకటయ్య జాను, ఓంకార్, దేవన్న, స్వామి, ఎల్లయ్య పాల్గొన్నారు.

పట్టణ పద్మశాలి సంఘం కార్యవర్గం ఎంపిక



నూతనంగా ఎంపికైన పద్మశాలి పట్టణ సంఘం కమిటీ

వనపర్తిటౌన్, జూన్ 3:పద్మశాలి పట్టణ సంఘం కార్యవర్గాన్ని సోమవారం ఎంపిక చేశారు. పట్టణంలోని నాగవరం సమీపంలో రిటైర్డ్ ఎంప్లాయిస్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ట్రస్ట్ చైర్మన్ వావిరాల శ్రీనివాసులు, పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కమర్థపు మురళీ, ప్రధాన కార్యదర్శి రామచంద్రరావు సమక్షంలో పట్టణ పద్మశాలి సంఘం నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. అనంతరం నూతనంగా ఎంపికైన గౌరవ అధ్యక్షుడు నీలి నారాయణ, పట్టణ అధ్యక్షుడు మునగాల శివరాములు, ప్రధాన కార్యదర్శి తిరుమల ఉశన్న, కార్యదర్శి కర్లీ శ్రీశైలం, కోశాధికారి చిన్ని కరుణాకర్‌తో పాటు కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించి, ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు జన్ను వెంకట్ నారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి కెంచె బాలప్ప, చెన్న పద్మ, కొంగరి మాణిక్యం, చెన్న సత్యనారాయణ, గంజి వెంకటరాములు తదితరులు పాల్గొన్నారు.

భరత్ కుమార్ గెలుపు కోసం పూజలు

పెబ్బేరు రూరల్, జూన్3: పార్ల మెంటు ఎన్నికల్లో బీజేపీ నాగర్ కర్నూల్ ఎంపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌కుమార్ అత్యధిక మెజార్టీతో గెలవాలని సూగూరు కోదండ రామాలయంలో సోమవారం బీజేపీ నాయకులు, కార్యకర్తలు హోమం నిర్వహించారు. బీజేపీ వనపర్తి జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్‌సాగర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు ఎల్లస్వామి, మాధవుడు, తరుణ్ పాల్గొన్నారు.



సూగూరు కోదండరామస్వామి ఆలయంలో హోమం చేస్తున్న బీజేపీనాయకులు

క్రీడా శిబిరాలతో

నైపుణ్యాల మెరుగుదల

- క్రీడాంశాల సాధనకు ఆసక్తి చూపిన బాలికలు
- జిల్లా వ్యాప్తంగా 450 మంది విద్యార్థులకు శిక్షణ
- యువజన క్రీడల శాఖను అభినందిస్తున్న క్రీడాకారులు



ఖిల్లాఘణపురం, జూన్ 3 : గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వేసవి క్రీడా శిబిరాలతో 14 సంవత్సరాలలోపు చిన్నారుల క్రీడా నైపుణ్యాలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. వేసవి సెలవుల్లో చిన్నారులను సెల్‌ఫోన్, టీవీలకు దూరంగా ఉంచడానికి వేసవి క్రీడా శిబిరాలు నిర్వహిస్తున్నారు. క్రీడల ద్వారా మానసిక ప్రశాంతత, ఒత్తిడిని జయించే సామార్థ్యం, శారీరక దారుఢ్యం, చిన్నారుల్లో ఏకాగ్రతను పెంపొందించడానికి ఈ శిబిరాలు ఉపయోగకరంగా ఉంటాయి. ఇందుకోసం ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి క్రీడా సామగ్రిని సమకూరుస్తూ క్రీడాంశాలలో తర్ఫీదునిచ్చే కోచ్‌లను ఏర్పాటు చేసింది. జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా శిక్షణ శిబిరాలు వేలాది మంది క్రీడాకారులను తయారు చేస్తున్నాయి. క్రీడాంశాలలో మెలకువలు నేర్చుకోవడానికి బాలబాలికలు ఆసక్తి కనబరుస్తున్నారు. వేసవికాలంలో చిన్నారులు సమయాన్ని వృథా చేయకుండా మే 1 నుంచి 30 రోజుల పాటు ప్రతీ రోజు ఉదయం ఆరు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు తిరిగి సాయంత్రం ఐదు గంటల నుంచి ఏడు గంటల వరకు క్రీడా మైదానాల్లో బాలబాలికలు వివిధ క్రీడల్లో శిక్షణ పొందారు. గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద కుటుంబాల చిన్నారులు క్రీడలలో తర్ఫీదు పొందడానికి తెల్లవారేసరికి క్రీడా మైదానాలకు చేరుకున్నారు. తెలంగాణ వ్యాప్తంగా ప్రతీ జిల్లాకు 10 కేంద్రాల్లో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించారు.

జిల్లాలో 12 ప్రాంతాల్లో వేసవి క్రీడా శిబిరాలు

వనపర్తి జిల్లా వ్యాప్తంగా జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో 12 ప్రాంతాల్లో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించారు. ఎనిమిది క్రీడాంశాల్లో శిక్షణ ఇచ్చేందుకు కోచ్‌లను నియమించారు. క్రీడా శిబిరాల్లో హాకీ, వాలీబాల్, కబడ్డీ, ఫుట్ బాల్, క్రికెట్, యోగ, తైక్వాండో, అథ్లెటిక్స్ క్రీడల్లో సుమారు 450 మంది చిన్నారులు శిక్షణ పొందారు. క్రీడా శిక్షకుడు తమ ప్రాంతంలోని బాలబాలికల ఆసక్తి, అభిరుచి మేరకు ఏ క్రీడలో శిక్షణ ఇస్తారో ముందే నిర్ధారణ చేశారు. క్రీడా ప్రాంగణాల్లో పాఠశాల మైదానాల్లో శిక్షణ శిబిరాలు నిర్వహించారు. ప్రభుత్వం అందించే ఉచిత క్రీడా సామగ్రితో క్రీడాంశాలలో ప్రతిభ చాటుతున్నారు.

చిన్నారులకు సువర్ణ అవకాశం



గ్రామీణ ప్రాంత యువకులు, చిన్నారులకు క్రీడల్లో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు సువర్ణ అవకాశంగా మారాయి. జిల్లా వ్యాప్తంగా 450 మంది విద్యార్థులు శిక్షణ కేంద్రాలను సద్వినియోగం చేసుకున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో రాణించడానికి విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై దృష్టి సారించాలి.

- సుధీర్ రెడ్డి, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి, వనపర్తి

జాతీయస్థాయి హాకీ క్రీడలో రాణించడమే లక్ష్యం



వేసవి క్రీడా శిబిరాన్ని సద్వినియోగం చేసుకొని జాతీయ స్థాయి హాకీ క్రీడలో రాణించడమే నా లక్ష్యం. గతేడాది వేసవి క్రీడా శిబిరంలో శిక్షణ పొంది రాష్ట్రస్థాయి హాకీ క్రీడల్లో మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా జట్టు తరపున ఆడాను. మారుమూల తండాలలో ఉన్న విద్యార్థులకు ఈ శిక్షణ శిబిరాలే హాకీ క్రీడను పరిచయం చేశాయి.

- అరుణ్ కుమార్, పదవ తరగతి, గట్లఖానాపూర్ తండా

మాజీ మంత్రి

బహిరంగ క్షమాపణ చెప్పాలి

- నిరంజన్‌రెడ్డి సంస్కారహీనంగా మాట్లాడటం సరికాదు
- కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్

వనపర్తి టౌన్, జూన్ 3: తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను నెరవేర్చిన సోనియా గాంధీని హేళన చేసి సంస్కారహీనంగా మాట్లాడటం మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డికి తగదని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్రం ఇస్తే రెండు తెలుగు రాష్ట్రాలలో కాంగ్రెస్ పార్టీకి నష్టం జరుగుతుందని తెలిసి కూడా దేశవ్యాప్తంగా ఉన్న చిన్నపెద్ద పార్టీలు దాదాపు 140 పార్టీలను ఒప్పించి, మెప్పించి పార్లమెంటులో బిల్లు పాస్ చేయించిన సోనియా గాంధీని కించపరచడం అవివేకమన్నారు. తాము ఇన్నేళ్లు మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డిని మంచి మేధావి అనుకున్నామని, సోనియా గాంధీపై తన వంకరబుద్ధి బయట పెట్టడంతో ఆయనేంటో తేలిపోయిందన్నారు. రాష్ట్రం ఇస్తే అప్పటి టీఆర్ఎస్ పార్టీనే కాంగ్రెస్‌లో విలీనం చేస్తామని, మీ ఆదినాయకుడు సోనియా గాంధీ కాళ్ల పట్టుకుంది నిజం కాదా అని ప్రశ్నించారు. అసెంబ్లీ సాక్షిగా సోనియాగాంధీ వల్లే రాష్ట్రం ఏర్పాటైందని మీ నాయకుడు చెప్పిన మాటలు నిజం కాదా? అని ప్రశ్నించాడు. ఇంకా బీఆర్ఎస్ పార్టే అధికారంలో ఉందనే భ్రమలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఉన్నాడని ఎద్దేవా చేశారు. దాదాపు ప్రజా ప్రతినిధులు ఎక్కువగా బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నారని, కాంగ్రెస్ పార్టీ నుంచి 200 కూడా లేరని, అలాంటప్పుడు ఎమ్మెల్సీగా పోటీ చేసిన మా నాయకుడికి 650 ఓట్లకు పైగా రావడంతో నైతికంగా మేమే గెలిచామని అన్నారు. ఎన్నికల కోడ్ ముగియగానే గ్యారెంటీలను అమలు చేస్తామని, ఈ బాధ్యత కాంగ్రెస్ పార్టీలో ఉన్న ప్రతీ నాయకుడు, కార్యకర్త తీసుకుంటాడని అన్నారు. ఆర్టీసీ సిబ్బందిని బీఆర్ఎస్ పార్టీ చిత్రహింసలకు గురి చేస్తే మా ప్రభుత్వంలో మాత్రం వారికి 23 శాతం ఫీట్‌మెంట్ ప్రకటించి గుండెల్లో పెట్టుకున్నారని తెలిపారు. మాజీ మంత్రి మాట్లాడే ముందు నోరు అదుపులో పెట్టుకోవాలని, సోనియా గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు రాష్ట్ర ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేదంటే నిరంజన్‌రెడ్డి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కదిరె రాములు, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ బీ కృష్ణ, మత్స్యకార సంస్థ జిల్లా చైర్మన్ నందిమల్ల యాదయ్య, మైనారిటీ నాయకుడు అనీస్, వెంకట్ నారాయణ, సేవాదళ్ జానకిరాములు, రామరాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు నిర్మాణానికి మోక్షం ఎప్పుడో

- బీటీ తొలగింపు.. వాహనదారుల అవస్థలు



పర్వతాపూర్ గ్రామ శివారులో బీటీని తొలగించడంతో కంకర తేలిన రోడ్డు

ఖిల్లాఘణపురం, జూన్ 3: మండలంలోని పర్వతాపూర్ నుంచి మండల కేంద్రానికి ఉన్న ఆర్ అండ్‌బీ రోడ్డు ధ్వంసం కావడంతో కొత్తరోడ్డు వేసేందుకు బీటీని తొలగించారు. కానీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టలేదు. దీంతో వాహన దారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రోడ్డు నిర్మాణానికి మోక్షం ఎప్పుడు ఉంటుందో లభిస్తుందోనని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రం నుంచి పర్వతాపూర్ గ్రామం వరకు రోడ్డుపై బీటీ తొలగిపోయి కంకర తేలి రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు పడ్డాయి. రోడ్డుపై అడు గడుగునా గుంతలు పడడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. మామిడి మాడ, పర్వతాపూర్, గ్రామస్థులు ప్రతీరోజు మండల కేంద్రానికి వివిధ పనులపై ఆటోలు, ద్విచక్ర వాహనాలపై ప్రయాణిస్తుంటారు. గుంతల రోడ్డుపై ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన చెందు తున్నారు. ఒకవైపు రోడ్లు వేస్తుంటే మరోవైపు బీటీ రోడ్లు ధ్వంసం అవుతున్నాయని, రోడ్లు ఒకే సారి వేసి వాహనదారుల ఇబ్బందులను తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేయాలి

ఆత్మకూరు, జూన్ 3: ఖరీఫ్ సీజన్‌లో ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ, విత్తనాలు ఎరువులు, పురుగు మందులు, మినీ ట్రాక్టర్స్ 50 శాతం సబ్సిడీపై ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం ఆధ్వర్యంలో ఆర్ఐ జయమ్మకు సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రగతిశీల రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాజన్న మాట్లాడుతూ.. రైతు రుణమాఫీ ఏకకాలంలో చేస్తామని హామీ ఇచ్చి ఆగస్టు నెలకు వాయిదా వేయడం సరైంది కాదన్నారు. అలాగే వ్యవసాయ ఉత్పత్తి సాధనాలు మినీ ట్రాక్టర్స్ 50 శాతం సబ్సిడీతో ఇవ్వాలని, దళిత గిరిజన చిన్న సన్నకారు రైతులకు ఉచితంగా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అఖిల భారత రైతు సంఘం నాయకులు ప్రసాద్, నగేష్, వెంకటన్న, కురువ వెంకటన్న, నారాయణరెడ్డి, చిన్న హనుమంత్, జంగం రంగన్న, రాములు తదితరులు పాల్గొన్నారు.



ఆర్ఐ జయమ్మకు వినతిపత్రం అందజేస్తున్న అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం నాయకులు

నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్ట్



పెబ్బేరులో విత్తనాల షాపును తనిఖీ చేస్తున్న అధికారులు



శ్రీరంగాపూర్‌లో ఎరువుల షాపును తనిఖీ చేస్తున్న అధికారులు

- జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారి చంద్రశేఖర్

పేపనగండ్ల, జూన్ 3: నకిలీ విత్తనాలు విక్రయిస్తే దుకాణదారులపై పీడీ యాక్ట్ చట్టం కింద కేసు నమోదు చేస్తామని జిల్లా టాస్క్ ఫోర్స్ అధికారి చంద్రశేఖర్ హెచ్చరించారు. సోమవారం మండలంలోని విత్తన దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్నందున రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలనే ఉద్దేశంతో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. విత్తన దుకాణాల్లో ఏ కంపెనీ విత్తనాలు ఉన్నాయి, విత్తన నాణ్యతలను పరిశీలించారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన విత్తన దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలని తెలిపారు. విత్తనాలు కొన్న రైతులు రశీదులను తప్పనిసరిగా తీసుకోవాలని వాటిని పంట చివరి వరకు భద్రపరుచుకోవాలని అన్నారు. నాణ్యతలేని విత్తనాలు విక్రయిస్తున్నట్లు సమాచారం అందితే వెంటనే 08545-233505 హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి డాకేశ్వర్‌గౌడ్, నాయబ్ తహసీల్దార్ కృష్ణమూర్తి, హెడ్ కానిస్టేబుల్ బీరయ్య ఉన్నారు.

పెబ్బేరులో..

పెబ్బేరు : పెబ్బేరు మండల కేంద్రంలోని పలు విత్తనాల షాపులను సోమవారం వ్యవసాయ శాఖ, పోలీసు శాఖ, రెవెన్యూ అధికారులు తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నకిలీ విత్తనాలు, కాలం చెల్లిన విత్తనాలు అమ్మితే చట్టపరంగా చర్యలు తీసుకొని షాపు యజమానులపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. విత్తనాలు అమ్మిన తరువాత రైతుల వివరాలను రిజిస్టరులో తప్పకుండా నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి చంద్రమౌళి, డీటీ లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.

చిన్నంబావిలో..

చిన్నంబావి : మండల కేంద్రంలోని ఆగ్రోసేవా కేంద్రం లావణ్య ట్రేడర్ షాపులను మండల ఇన్‌చార్జి ఏవో డాకేశ్వర్ గౌడ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధికారి చంద్ర శేఖర్, కొత్తకోట ఏడీఏ దామోదర్, డీటీ శ్రీనివాసులు పోలీస్ సిబ్బంది ఉన్నారు.

శ్రీరంగాపురంలో..

శ్రీరంగాపురం : నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి చంద్రమౌళి, ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం శ్రీరంగాపూర్‌లో ఎరువులు, విత్తనాల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలన్నారు.



పేపనగండ్లలో విత్తన దుకాణాల్లో తనిఖీలు చేస్తున్న అధికారులు

గ్రూప్ వన్ పరీక్షల అర్థరహిత నిబంధనలు తొలగించాలి

- ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎండీ కుతూబ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎండీ కుతూబ్

వనపర్తి టౌన్, జూన్ 3: రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 9న నిర్వహించే గ్రూప్-1 పరీక్షల కోసం పెట్టిన అర్థరహిత నిబంధనలను తొలగించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎండీ కుతూబ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రూప్-1 పరీక్షలకు హాజరైయ్యే గృహిణులు తాళిబొట్టు, మెట్టెలు తీసేసి పరీక్షలకు హాజరు కావాలని, అదేవిధంగా పరీక్షల ప్రారంభానికి అరగంట ముందే పరీక్ష కేంద్రాల గేటు మూసేస్తామనే నిబంధనలు సరికాదన్నారు. వర్షాలు కురుస్తున్నందున అరగంట ముందే రావాలనే నిబంధన కూడా సరికాదన్నారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ నాయకులు విష్ణు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

యువ రైతులకు ఆధునిక వ్యవసాయంపై శిక్షణ

పెబ్బేరు రూరల్, జూన్ 3: మండలంలోని యువ రైతులకు సేంద్రీయ వ్యవసాయంపై మదనాపురంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో 25 రోజుల పాటు ఉచిత శిక్షణ నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి బిందు తెలిపారు. ఆరో తరగతి నుంచి పీజీ చదువుకున్న విద్యార్థులకు అవకాశం ఉందని, శిక్షణలో ఆధునిక వ్యవసాయ ప్రకృతి వ్యవసాయం, సుస్థిర వ్యవసాయం, భూసార సంరక్షణ తదితర అంశాలపై శిక్షణ ఇస్తారని ఆమె తెలిపారు. ఈ నెల 9వ తేదీ దరఖాస్తులను కృషి విజ్ఞాన కేంద్రంలో నమోదు చేసుకోవాలన్నారు.

కరాటే విద్యార్థులకు బెల్టులు ప్రదానం



ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో నిర్వాహకులు

కొత్తకోట, జూన్ 3 : గాడ్స్‌ఆన్ వారియర్ చోటోఖాన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో గ్రేడింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బెల్టులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అకాడమీ చైర్మన్ మాస్టర్ అబ్దుల్ నబీ, కరాటే మాస్టర్లు హరీశ్ యాదవ్, జాఫర్, సాదిక్, బాబా అజ్మీర్, లాస్య కార్తికేయ యాదవ్, ఎస్‌కే. గౌస్, పాష ఉన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

అమరచింత, జూన్3: అసంఘటితం కార్మిక సమస్యలను పరిష్కరించాలని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ నాయకులు ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చాలీచాలని వేతనాలతో జీవనం గడుపుతున్న మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై పాలక ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆయన అన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలను పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం కార్మికులను గుర్తించి వారి న్యాయబద్ధమైన అన్ని డిమాండ్లను పరిష్కరించాలని ఆయన కోరారు. అసంఘటిత కార్మికులకు, కార్మిక చట్టాల అనుగుణంగా వేతనాలు ఇచ్చి వారిని ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.